# సాక్షి మంచిర్యాల

బుధవారం । 12 । జులై । 2023






**మరణాల్లేని మాసం..!**

ప్రతీయేటా జూన్‌లో భయాందోళనల మధ్య సింగరేణి కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. ఈయేడు ఏ ఒక్కరి ప్రాణం కూడా పోవద్దని కంపెనీ భావించింది. 8లో▸



**రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడంపై ఆందోళనలు చేపట్టారు. ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. 9లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
30.0 /25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

## న్యూస్‌రీల్

### 30.9మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు 30.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది వర్షకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అధికం కావడం గమనార్హం. కోటపల్లి మండలంలో 64 మిల్లీమీటర్లు, భీమినిలో 60.6, కన్నెపెల్లిలో 59.7, చెన్నూర్‌లో 47.2, వేమనపల్లిలో 45.2, జైపూర్‌లో 39.9, భీమారంలో 37.9, నెన్నెలలో 36.9, కాసిపేటలో 23.1, మందమర్రిలో 12.7, బెల్లంపల్లిలో 30, జన్నారంలో 7.7, దండేపల్లిలో 13.9, నస్పూర్‌లో 15.7, మంచిర్యాలలో 19, తాండూర్‌లో 17.5, లక్సెట్టిపేటలో 11.7, హాజీపూర్‌లో 12.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 265.7మిల్లీమీటర్లు కాగా 205.4 మిల్లీమీటర్లు కురిసింది.

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నస్పూర్: జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే) ఐజేయూ అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షుడు డేగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్‌రెడ్డి కోరారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఇళ్ల నిర్మాణానికి గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షలు ఇప్పించాలని కోరారు. కలెక్టరేట్ కార్యాలయం మీడియా పాయింట్ వద్ద ఒక గది కేటాయించాలని పేర్కొన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో పూర్తి స్థాయి ఫీజు రాయితీ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కౌెట్టి వంశీకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపురెడ్డి ప్రకాశ్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు కాచం సతీష్, ఉపాధ్యక్షుడు చౌదరి సురేశ్, నాయకులు సాదుల ఉదయ్‌కుమార్, రాజేశ్, కలువల శ్రీనివాస్, జనార్దన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

### దశాబ్ది ఉత్సవాల పుస్తక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జిల్లా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సంక్షిప్త సమాచారం పుస్తకాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి కలెక్టరేట్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఉత్సవాలను విజయవంతం చేయడంలో జిల్లా అధికార యంత్రాంగం కృషి అభినందనీయమని పేర్కొన్నారు. డీపీఆర్‌ఓ వై.సంపత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

### నియామక పత్రాలు అందజేత

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గుర్తించిన పోస్టుల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిన పని చేయడానికి 2019లో నిర్వహించిన రాత పరీక్ష ద్వారా ఎంపికైన 18 మంది అభ్యర్థులకు డీఈవో యాదయ్య మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ 4, మండల స్థాయి డాటాఎంట్రీ ఆపరేటర్లు 4, ఐఈఆర్పీ 7, సిస్టమ్ ఎనాలిస్టు, అసిస్టెంట్, ప్రోగ్రామర్, డాంట్రా ఎంట్రీ ఆపరేటర్లకు ఉత్తర్వులు అందజేశారు.

# చెరువు నిండలేదు..!

- నీరు లేక నారు పోయలే..
- నెల గడిచినా జలాశయాల్లోకి చేరని నీళ్లు
- వర్షాభావ పరిస్థితులతో వరి సాగుకు వెనుకడుగు
- 14 మండలాల్లో లోటు వర్షపాతం



కొత్త నీరు రాక బోసిపోయిన నెన్నెల దశలికుంట చెరువు

మంచిర్యాలఅగ్రికల్చర్: వర్షాకాలం సీజన్ ప్రారంభమై నెల గడుస్తోంది. చెరువులు నిండక.. రైతులు నారు పోసేందుకు వెనుకడుగు వేయాల్సి వస్తోంది. వాగులు, వంకలు, నిండుకుండలను తలపించాల్సిన చెరువులు, కుంటలు బోసిపోయాయి. గత ఏడాది భారీ వర్షాలతో ఇదే సమయానికి చెరువులు అలుగు పోశాయి. భారీ వర్షాల్లేక.. జలాశయాల్లోకి నీరు చేరక అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే వరినాట్లు వేసుకోవడం 80శాతం పూర్తి కావాల్సి ఉండగా నారే పోసుకోలేదు. చెరువులు, కుంటలు, జలాశయాల కింద సాగువుతున్న వరి పొలాలన్నీ బీడుగా మారుతున్నాయి. జిల్లాలోని 18 మండలాలకు గాను నాలుగు మండలాలు మినహా మిగతా 14 మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది. ఈ నాలుగు మండలాల్లో కూడా సోమవారం రాత్రి నుంచి మంగళవారం కురిసిన వర్షంతోనే సాధారణ స్థాయి వర్షపాతం నమోదైంది. గత నెలలో ఒకట్రెండు మోస్తారు వర్షాలు కురువగా ఈ నెలలో రెండుసార్లు ఓ మోస్తారు వర్షం కురిసింది. అది కూడా కొన్ని మండలాలకే పరిమితం కాగా.. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షమే కురిసింది. దీర్ఘకాలిక వరి సాగు 140 నుంచి 150 రోజుల్లో దిగుబడి వచ్చే రకం నాట్లు వేసుకునే గడువు ముగిసింది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే స్వల్పకాలిక వరి రకాలు వేసుకునే అవకాశం ఉంది. ఈ నెలాఖరు వరకునారు పోసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

**ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం..**

జిల్లాలో పత్తి, వరి పంటలు అధికంగా సాగవుతాయి. గత నెలలో పత్తి విత్తనాలు వేసుకోగా ఆశించిన వర్షాల్లేక మొలకెత్తలేదు. ఎత్తిన మొలక వడలిపోయింది. ఆలస్యంగా కురిసిన మోస్తారు వర్షాలకు ఒకటికి రెండుసార్లు విత్తుకోవాల్సి వచ్చింది. ఈ నెల 15వరకు పత్తి విత్తనాలు విత్తుకోవచ్చని వ్యవసాయ శాఖ చెబుతోంది. గత నెలలో వర్షాల్లేక నారు పోసుకోలేదు. బోర్లు, నీటి సౌకర్యం ఉన్న కొంతమంది రైతులు నాట్లు వేసుకుని ఎదురు చూడాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిసే బలమైన కార్తెల్లోనూ వర్షాల్లేవు. కార్తెలు కరిగిపోయి భారీ వర్షాల్లేక వరి సాగుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. జులై మొదటి వారం వరకు నాట్లు వేసుకుంటే అక్టోబర్‌లో పంట దిగుబడి వస్తుంది. ఆగస్టులో నాట్లు వేసుకుంటే నవంబర్ వరకు పంట కాలం ఉంటుంది. వాతావరణ మార్పు, ఆలస్యపు సాగుతో చీడపీడల ఉధృతి పెరగడంతోపాటు దిగుబడులపై ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో వానాకాలం పంట సాగు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి జలాశయాలు నిండితే ఆగస్టు వరకు స్వల్పకాలిక వరి రకాలు 110 నుంచి 120 రోజుల్లో దిగుబడి వచ్చే వరి సాగు చేయాల్సి ఉంటుంది.

**23 శాతం లోటు వర్షపాతం**

జిల్లాలో జూన్ 1 నుంచి ఈ నెల 11 వరకు సాధారణ వర్షపాతం 265.7 మిల్లీమీటర్లు కాగా 205.8 మిల్లీమీటర్లు కురిసింది. 23 శాతం లోటు వర్షపాతం నెలకొంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతోనే సాధారణ స్థాయికి కొన్ని మండలాలు చేరువయ్యాయి. ఈ వానాకాలంలో సోమవారం రాత్రి కురిసిందే అధిక వర్షపాతం కావడం గమనార్హం. జైపూర్, చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల్లోనే సాధారణ స్థాయి వర్షపాతం నమోదు కాగా మిగతా 14 మండలాల్లో 20 నుంచి 45 శాతం లోటు నెలకొంది. భారీ వర్షాలకు కీలకమైన జులై నెల రెండో వారం వచ్చినా భారీ వర్షాలు లేక జలాశయాల్లోకి నీరు చేరక బోసిపోతున్నాయి. వరి సాగు సమయం దాటిపోతోందని జిల్లాలోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



**నారు అలకలే..**



వానాకాలం నెల రోజులు గడిచింది. మృగశిర కార్తె, అరుద్ర కార్తె పోయింది. భారీ వర్షాలు లేవు. మా ఊరి పెద్దచెరువులకు నీళ్ల రాలే. చెరువు కింద ఉన్న రెండు ఎకరాల పొలం ఇంకా నారే పోసుకోలేదు. పోయిన ఏడాది చెరువు నిండి అలుగు పారింది. ఈ ఏడాది వర్షాలు లేక పొలం బీడు పోకటే ఉన్నట్లు ఉంది.

– పుప్పిరెడ్డి రాఘవరెడ్డి, నెన్నెల

**పోయినేడాది భారీ వర్షాలు..**



పోయిన వానాకాలం ఇదే సమయానికి భారీ వర్షాలు, వరదలతో వరి పొలాలు, పత్తి చేన్లు చెరువులను తలపించినయి. వరదలతో పత్తి మొలక, వరినారు కొట్టుపోయింది. ఈ ఏడాది వర్షాలు లేక చెరువులకు నీళ్లే రాలేదు. పోయినేడాది కాలం పంటలను నిండా ముంచితే.. ఈ ఏడాది పంటలు ఎండబెట్టేటట్లే ఉంది.

– సిటి పోషం, గ్రామం: టికులపల్లి, మం: భీమిని

**జిల్లాలో నమోదైన వర్షపాతం(మిల్లీమీటర్లలో) జూన్ 1 నుంచి ఈ నెల 11 వరకు**

| మండలం | జన్నారం | దండేపల్లి | లక్సెట్టిపేట | హాజీపూర్ | కాసిపేట | తాండూర్ | భీమిని | కన్నెపెల్లి | వేమనపల్లి | నెన్నెల | బెల్లంపల్లి | మందమర్రి | మంచిర్యాల | నస్పూర్ | జైపూర్ | భీమారం | చెన్నూర్ | కోటపల్లి |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| కురవాల్సింది | 304.0 | 248.7 | 262.6 | 268.3 | 264.5 | 239.9 | 276.3 | 280.6 | 278.3 | 258.2 | 258.8 | 251.1 | 262.6 | 261.7 | 279.3 | 270.6 | 264.3 | 252.5 |
| కురిసింది | 200.6 | 164.0 | 146.2 | 157.6 | 237.7 | 174.4 | 146.7 | 174.8 | 198.5 | 151.0 | 213.2 | 187.4 | 168.8 | 206.1 | 328.1 | 285.5 | 296.2 | 267.0 |
| లోటు శాతం | 34 | 34 | 44 | 41 | 10 | 27 | 47 | 38 | 29 | 42 | 18 | 25 | 36 | 21 | 17 (అధికం) | 6(అధికం) | 12(అధికం) | 6(అధికం) |


## సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడుతో కలిసి జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కీటక జనిత వ్యాధుల నియంత్రణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని అన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు యాంటీ లార్వా ఆపరేషన్ పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఫ్రైడే–డ్రై డే నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ నెల 10, 27వ తేదీల్లో పంపిణీ చేయాలని అన్నారు. ఇంద్రధనస్సు కార్యక్రమంలో మిజిల్స్, రూబెల్లా వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా ఆగస్టులో 7 నుంచి 12 వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్‌లో 9 నుంచి 14 వరకు వ్యాక్సినేషన్ నిర్వహిస్తామని తెలిపారు.

## కుటుంబ నియంత్రణ సామాజిక బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జనాభా పెరుగుదలతో కలిగే ఇబ్బందులకు కుటుంబ నియంత్రణ తాత్కాలిక, శాశ్వత పద్ధతులపై ప్రజలకు అవగాహన కలగాలని, కుటుంబ నియంత్రణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. కుటుంబ నియంత్రణ అంశాలను ప్రజలకు వివరించారు. నేటి కుటుంబ ప్రణాళిక రేపటి ప్రగతికి సూచికగా భావించాలని, జనాభాను నియంత్రించకపోతే అన్ని అనర్థాలే జరుగుతాయని అన్నారు. జనాభా ప్రాతిపదికన దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని, జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో ప్రగతి కుంటుపడుతుందని, జనాభా నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయపూర్ణిమ, ప్రోగ్రాం అధి కారులు డాక్టర్ నీరజ, డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రశాంతి, అల్లాడి శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

జిల్లా కేంద్రం మంచిర్యాల గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 202 విద్యార్థులు చదువుతున్నారు. మంగళవారం 121 మంది హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం కార్మికులు వంట బంద్ చేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులే నిత్యావసర సరుకులు, కూరగాయలు తెచ్చి గరిట తిప్పారు. వంట చేసిన తర్వాత వడ్డించి పిల్లలకు భోజనం అందించారు.



గర్మిళ్ల ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న ఉపాధ్యాయులు



ఏసీసీ అంబేద్కర్ కాలనీ స్కూల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తున్న విద్యార్థులు

- గరిట తిప్పిన ఉపాధ్యాయులు
- టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె రెండో రోజు మంగళవారమూ కొనసాగించారు. బిల్లులు సకాలంలో రాక.. పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచకపోవడం.. సమస్యల పరిష్కారానికి కార్మికులు సమ్మెబాట పట్టారు. విద్యార్థులను పస్తులు ఉంచలేక ఉపాధ్యాయులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. వంట చేసి వడ్డించారు.. ఇంకొన్ని చోట్ల విద్యార్థులు ఇంటి నుంచే టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకున్నారు. ఒకట్రెండు పాఠశాలల్లో తాత్కాలిక వంట కార్మికులను ఏర్పాటు చేసుకుని మధ్యాహ్న భోజనం అందించారు. తక్కువ విద్యార్థులున్నా చోట పేరేంట్స్ భోజనం తీసుకువచ్చి పిల్లలకు వడ్డించడం కనిపించింది.

**అమలు ఇలా..**

జిల్లాలోని 782 పాఠశాలల్లో 53,852 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలవుతోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,280 మంది కుక్, కమ్ హెల్పర్లు పనిచేస్తున్నారు. 1నుంచి 8వ తరగతి వరకు 42,352 మంది, 9నుంచి 10వ తరగతి వరకు 11,500 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.5.45, ఆరు నుంచి 8వ తరగతి వరకు రూ.8.17, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రూ.10.67 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. వంట ఏజెన్సీల నిర్వాహకులే నెలనెలా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి ప్రభుత్వం నుంచి వచ్చినప్పుడు తీసుకుంటారు. నెలనెలా డబ్బులు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచడం వల్ల ఆర్థిక భారం పడుతోందని వంట కార్మికులు వాపోతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటుతుండడం.. అరువు తెచ్చి మధ్యాహ్న భోజనం నెట్టుకురావాల్సి వస్తుండడంతో మూడు రోజులపాటు సమ్మె చేపట్టామని ఆవేదన వ్యక్తం చేశారు.

**డిమాండ్లు ఇవిగో...**

జీవో నెంబర్–8 ప్రకారం వేతనాలను ఏరియర్స్‌తో సహ చెల్లించాలి. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. కొత్త మెనూ సవరించాలి. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలి. గ్యాస్ సబ్సిడీపై ఇవ్వాలి. గుర్తింపు కార్డులు ప్రభుత్వమే అందించాలి. అక్రమ తొలగింపులు అరికట్టాలి. వంట షెడ్లు, వంటపాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలి. యూనిఫామ్ తోపాటు సామాజిక భద్రత కల్పించాలి. ప్రమాద భీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజుల సమ్మె చేపట్టారు.

**బిల్లుల్లో జాప్యం..**

వంట ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్, ఈ విద్యాసంవత్సరం జూన్ నెల బిల్లులు చెల్లించాల్సి ఉందని వంట ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. ఒకటి నుంచి 8వ తరగతి ఎగ్ బిల్లులు, కుకింగ్ చార్జీ రూ.35,70,000, ఎగ్ బిల్లులు రూ.42,35,200 బిల్లులతోపాటు తొమ్మిది, పదో తరగతికి చెందిన రూ.32,53,500 ఏప్రిల్ వరకు నిధులు మంజూరైనట్లు అధికారులు అంటున్నారు. బిల్లులు మొత్తం తయారు చేసి ఎస్టీవోలో అందజేయగా ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉండడం వల్ల సమస్యగా మారిందని చెబుతున్నారు. అక్కడ క్లియర్ అయితే ఏజెన్సీ ఖాతాల్లో నిధులు జమవుతాయని, కొంత ఆలస్యమైనా తప్పకుండా బిల్లులు వస్తాయని తెలిపారు.

**స్పందించకుంటే నిరవధిక సమ్మె**



గౌరవ వేతనం రూ.వెయ్యి నుంచి రూ.3వేలు పెంచుతా మని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. రూ.2వేలు అదనంగా ఇచ్చేందుకు జీవో జారీ చేసినా అమలులో నిర్లక్ష్యం చూపుతున్నారు. నెలనెలా బిల్లులు సకాలంలో రాక అప్పులు ఇచ్చినోళ్లకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్‌లో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగిపోయాయి. కోడిగుడ్డుకు ప్రభుత్వం ఇచ్చేది తక్కువ, మార్కెట్లో ఎక్కువ ధర ఉంది. ప్రభుత్వం డిమాండ్లపై స్పందించకుంటే ఈ నెల 14 తర్వాత ఏ రోజు నుంచైనా నిరవధిక సమ్మెకు దిగుతాం.

– రాజేశ్వరి, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

# మున్సిపల్ సిబ్బందిని అడ్డుకున్న ప్రజలు



డంపింగ్ యార్డు వద్ద చెత్త తరలించే వాహనాలను అడ్డుకున్న స్థానికులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఆండాళమ్మ కాలనీలో పన్ను వసూళ్లకు వెళ్లిన మున్సిపల్ సిబ్బందిని ప్రజలు అడ్డుకున్నారు. ఇటీవల ప్రతీరోజు కాలనీలోని డంపింగ్ యార్డులో చెత్త వేయడాన్ని కాలనీవాసులు అడ్డుకుంటుండగా.. మున్సిపల్ సిబ్బంది మొత్తం మంగళవారం ఇంటింటికి పన్ను వసూలుకు వెళ్లారు. అప్పటికప్పుడు పన్ను చెల్లించాలని, గతంలో నివాసం కోసం ప్రభుత్వం ఇచ్చిన స్థలం ఎంత, ప్రస్తుతం ఎంత స్థలంలో నివాసం ఉంటున్నారు, ఎంత పన్ను చెల్లిస్తున్నారు అంటూ ప్రశ్నించారు. దీంతో కాలనీవాసులు ఎదురు తిరిగారు. డంపింగ్‌యార్డు, శ్మశాన వాటిక తరలించాలని, చెత్త కాల్చడం వల్ల దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, న్యాయబద్ధంగా ఆందోళన చేస్తుంటే ఆస్తి పన్ను పెండింగ్‌లో ఉందంటూ ఒత్తిడి తెస్తున్నారంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీవాసులు, సిబ్బంది మధ్య వాగ్వాదం తీవ్రం కావడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ పన్ను వసూలు సిబ్బందిని అక్కడి నుంచి పంపించివేశారు. హాజీపూర్ మండలంలో డంపింగ్ యార్డు కోసం స్థలం సేకరించామని, రెండు నెలల తర్వాత డంపింగ్ యార్డు తరలిస్తామని చెప్పారు. అయినా కాలనీ ప్రజలు చెత్త వాహనాలను అడ్డుకోవడంతో అక్కడే నిలిపివేశారు.

**చెత్త వాహనాల అడ్డగింత**

మంచిర్యాలటౌన్: ఆండాళమ్మ కాలనీలో డంపింగ్ యార్డుకు వచ్చిన వాహనాలను కాలనీవాసులు మంగళవారం అడ్డుకున్నారు. వాహనాలు యార్డు వద్దనే నిలిచిపోయాయి. చెత్త వేసి నిప్పు పెడుతున్నారని, ఆ పొగతో వ్యాధుల బారిన పడడంతోపాటు శ్వాస సంబంధమైన వ్యాధులు వస్తున్నాయని, దుర్వాసనతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని, అప్పటివరకు చెత్తను డంపింగ్ యార్డులో వేయనివ్వబోమని స్పష్టం చేశారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నస్పూర్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో పని చేస్తున్న డైలీ వైజ్, పార్ట్‌టైం, అన్ని రకాల వర్కర్లకు గత ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన హాస్టల్స్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ట్రైనీ కలెక్టర్ గౌతమికి సమర్పించారు. పెండింగ్ వేతనాలు, పెరిగిన వేతనాలు, పెండింగ్ ఏరియర్స్ ఆగస్టు 10 వరకు చెల్లించాలని, లేనిపక్షంలో ఆగస్టు 11 నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చందు, లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు భీమయ్య, రమేష్, సహాయ కార్యదర్శులు వెంకటేశ్, నాయకులు బక్కయ్య, వజ్రమ్మ, లక్ష్మి, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, పోలీస్ అధికారుల దాడి


బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

**భీమిని:** మండలంలోని చిన్నగుడిపేట పంచాయతీ పరిధి లంబాడీతండా గ్రామంలో మంగళవారం ఎక్సైజ్, పోలీస్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. లంబాడీతండా కాలనీలో ఇండ్లలో నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. బాధ్యుడైన అజ్మీరా సీతారాంపై కేసు నమోదు చేశారు. నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై మహేందర్, ఎక్సైజ్ ఎస్సై నిర్మల పాటిల్, హెడ్‌కానిస్టేబుల్ ఓదెలు, కానిస్టేబుల్ మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రి ఎదుట సోమవారం అర్ధరాత్రి బల్లార్షా, ఎర్నాకులం సూపర్‌ఫాస్ట్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మృతుడు 35–40 ఏళ్ల మధ్య ఉంటాడని పేర్కొన్నారు. మృతుడు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోందని వివరించారు. బ్లాక్ షర్ట్, కుడి చేతికి గ్రీన్, రెడ్ రిస్ట్ బ్యాండ్ ధరించి ఉన్నాడని తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వ్యక్తులు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ 871265859, 9948481902 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి


వెంకన్న (ఫైల్)

**పెంచికల్‌పేట్:** మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన ఉప్పబోయిన వెంకన్న (40) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్న మంగళవారం తన పొలం వద్ద వ్యవసాయ పంపుసెట్ రిపేర్ చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం కాగజ్‌నగర్ పట్టణానికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. వెంకన్న కొండపల్లి పంచాయతీ వార్డు సభ్యుడిగా కొనసాగుతున్నాడు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

**ఆసిఫాబాద్:** మండలంలోని బూర్గుడ గ్రామంలో మంగళవారం ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 12.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తారామణి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్ గ్రామానికి చెందిన బుజాడి రాజేశ్వర్ ఇంట్లో గ్రామ పెద్దల సమక్షంలో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. రాజేశ్వర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**వాంకిడి:** అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వాంకిడి మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ జావిద్ అక్రమంగా తరలించేందుకు ఇంట్లో నిల్వ చేసిన రెండు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.



# మరణాల్లేని మాసం..!

- అవగాహన కల్పించినందునే.. జూన్‌లో ఒక్క మరణం లేదు
- ఫలించిన ఎస్వోపీ విధానం
- తొమ్మిదేళ్ల తర్వాత రికార్డు
- ఇదే స్ఫూర్తి కొనసాగిస్తే మేలు


ఎస్సార్పీ–3గనిలో రక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు (ఫైల్)

**శ్రీరాంపూర్:** ప్రతీ సంవత్సరం జూన్‌లో భయాందోళనల మధ్య సింగరేణి కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. గడిచిన సంవత్సరాల్లో ప్రతీ జూన్‌లో ఏదో ఒకచోట ప్రమాదం జరగడం.. ఒకరిద్దరూ కార్మికులు ప్రాణాలు కోల్పోవడమే కారణం. మిగతా నెలల కంటే జూన్‌ను ప్రమాదాల నెలగా కార్మికులు భావిస్తున్నారు. కంపెనీలో తొమ్మిదేళ్లుగా రికార్డవుతున్న మరణాల సంఖ్య చూస్తే ఇదే తెలుస్తోంది. ఈ జూన్‌లో ఏ ఒక్క కార్మికుడి ప్రాణం పోవద్దని కంపెనీ భావించింది. అధికారులు కూడా దీనిని ఓ టాస్క్‌గా భావించి పక్కా ప్రణాళికలు రూపొందించారు. కార్మికులకు రక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఎట్టకేలకు అనుకున్నది సాధించారు. 2023 జూన్ మరణాలు లేని మాసంగా రికార్డు కెక్కింది. ఈ ఫలితాల నూతనోత్తేజంతో మిగతా మాసాల్లోనూ ఇదే ఒరవడితో పని చేయాలని అధికారులు అంతిమంగా నిర్ణయించారు. ప్రకృతి విరుద్ధంగా జరిగే మైనింగ్‌లో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం సంభవిస్తుంటుంది. కొన్ని ఊహకందని ప్రమాదాలు (గాడ్ ఆఫ్ యాక్ట్) జరిగితే, మరికొన్ని మానవ తప్పిదాలతో జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారు. రెండో తరహా ప్రమాదాలకు అధికారుల నిర్లక్ష్యమా?.. కార్మికుల నిర్లక్ష్యమా?.. అనేది అటుంచితే ఈ ప్రమాదాలను నివారించే బాధ్యత అందరిది. ఈ తరహా ప్రమాదాల నివారణకు గత పదేళ్లుగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో ప్రమాదాల రేటు తగ్గుతోంది. 2022 రికార్డులు అవే చెబుతున్నాయి. కనిష్ఠ స్థాయి మరణాల రేటు నమోదైంది. కాగా, జనవరి నుంచి డిసెంబర్ వరకు 12 నెలల్లో జూన్‌లోనే మరణాలు తప్పనిసరిగా జరుగుతున్నాయి. కారణమేదైనా ప్రాణనష్టం మాత్రం తప్పడం లేదు.

**మే నుంచి ప్రత్యేక టాస్క్..**

ఈ జూన్‌లో ప్రమాదాల నివారణకు మే నుంచే అధికారులు ప్రత్యేక టాస్క్ చేపట్టారు. సీఎండీ, డైరెక్టర్ల ఆదేశాల మేరకు కార్పొరేట్ జీఎం (సేఫ్టీ) కే గురువయ్య దీన్ని సవాల్‌గా తీసుకొని భూగర్భ గనులు, ఓసీపీ గనులు, డిపార్ట్‌మెంట్లపై అధికారులు రక్షణపై విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వర్క్ డిస్ట్రిబ్యూషన్ సమయంలో నిత్యం రక్షణ సూత్రాలు వివరించేవారు. మందమర్రి, రామగుండం, కొత్తగూడెంలో ఉన్న సేఫ్టీ ఇన్ మైన్స్ టెస్టింగ్ అండ్ రీసెర్చ్ స్టేషన్ (సింటార్స్) ద్వారా 2021 నుంచే ప్రత్యేకంగా రక్షణపై దృష్టి పెడుతూ సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్వోపీ)లు తయారు చేశారు. గనుల స్థాయిలో తయారు చేసిన ఈ ఎస్వోపీలను సింటార్స్ అధికారులు స్క్రూటినీ చేసి డీజీఎంఎస్‌కు పంపగా వారు ఫైనల్ చేసిన ఎస్వోపీలను అమలు చేయడం ప్రారంభించారు. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో ఎలా పని చేయాలి.. తన కేటగిరీ పనులు చేసేటప్పుడు ఎలా రక్షణతో పనిచేయాలి.. ఈ విధానాన్ని ఈ ఎస్వోపీలో రాసుకొని దాన్ని అమలు చేయించారు. ఎస్వోపీల ప్రకారం పని ఎలా మొదలు పెట్టాలి.. ఎలా ముగించాలో.. ఇందులో స్పష్టంగా నిర్దేశించుకున్నారు. దీంతోపాటు పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) ధరించి పని చేయాలని అవగాహన కల్పించి దానిని అమలుచేశారు. రక్షణ టూల్స్‌ను పూర్తి స్థాయిలో సమకూర్చారు. వీటన్నింటి ఫలితంగానే గత జూన్‌లో ఒక్క మరణం సంభవించలేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అధికారులు పెట్టుకున్న లక్ష్యం నెరవేరింది

| ప్రమాదాల వివరాలు.. | | | |
|---|---|---|---|
| సంవత్సరం | మరణాలు | సీరియస్ ప్రమాదాలు | జూన్‌లో.. |
| 2015 | 7 | 245 | 1 |
| 2016 | 12 | 218 | 1 |
| 2017 | 12 | 219 | 1 |
| 2018 | 7 | 191 | 1 |
| 2019 | 8 | 138 | 1 |
| 2020 | 12 | 102 | 4 |
| 2021 | 13 | 122 | 1 |
| 2022 | 5 | 96 | 1 |
| 2023 జూలై 11 నాటికి | 2 | 36 | 0 |

### జీరో ప్రమాదాలే లక్ష్యం



జీరో ప్రమాదాల కంపెనీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రతీ జూన్‌లో ప్రమాదాలు జరిగి ఉద్యోగులు చనిపోతున్నారు. ఈసారి అలా జరగవద్దని ముందునుంచే ఉద్యోగులకు విస్తృతంగా అవగాహన కల్పించాం. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. ఎస్వోపీలు పక్కాగా అమలు చేయడంతోనే ఈ జూన్ ఫ్యాటల్ యాక్సిండెంట్ ఫ్రీ నెలగా రికార్డు నెలకొల్పాం. ఇదే స్ఫూర్తితో మున్ముందు పనిచేస్తాం. – కే గురవయ్య, జీఎం (సేఫ్టీ, కార్పొరేట్)

**నా భద్రత.. నాదే బాధ్యత..**

ప్రతీ ఉద్యోగి నా భద్రత.. నాదే బాధ్యత.. అనే నినాదంతో పని చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఉద్యోగి సేఫ్టీగా పని చేయడం కోసం ఎస్వోపీలు తయారు చేసి వాటిని పాటిస్తూ పని చేయాలని పేర్కొన్నారు. గనుల్లో మానిటర్స్ (సూపర్‌వైజర్స్), ఇంప్లిమెంటర్స్ (అధికారులు) సమన్వయం చేసుకుంటూ పని చేశారు. ఉద్యోగి తన పనిపై ఆటిట్యూడ్, బిహేవియర్, కల్చర్, డిసిప్లేన్ ఎలా మార్చుకొని పని చేయాలో సూచనలు చేస్తూ అవగాహన కల్పించడంతో మంచి ఫలితాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌లో కొన్ని..**

- ప్రమాదాల బారిన పడకుండా ఉద్యోగులకు రేడియం జాకెట్లు పంపిణీ చేసి వాటిని వాడడం తప్పనిసరి చేశారు.
- పాత కాలపు షార్ట్‌కట్ మెథడ్స్‌తో పని చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రహించి వాటిని పూర్తిగా వీడాలని గనులపై సేఫ్టీ టీంలు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాయి.
- ట్రామర్లు జంక్షన్‌లో టబ్బులు కలిపేటప్పుడు, విడదీసేటప్పుడు వాటి మధ్య స్పేసర్లు, సేఫ్టీ హుక్ తప్పనిసరిగా పెట్టి పని చేయిస్తున్నారు.
- ఓసీపీ డంపర్లలో ఉండే ఫ్యాటిగ్ సెన్సార్‌ను ఆఫ్ చేయకుండా ఆన్‌లో ఉంచి పని చేయిస్తున్నారు. ఇది ఆన్‌లో ఉంటేనే ఆపరేటర్ ఒకవేళ నిద్రపోతే కళ్లు మూసిన వెంటనే అది సెన్సార్ పసిగట్టి అలారం మోగుతుంది. దీంతో ఆపటరేటర్ అలర్ట్ అవుతున్నారు.
- మ్యాగ్జిన్ దూరంగా ఉంటే బైక్‌లపై తీసుకెళ్లేవారు (ఉదా: ఎస్సార్పీ 3, 3ఏ/ ఎస్సార్పీ–1). ఇప్పుడు నడుచుకుంటూ వెళ్లి తీసుకెళ్లాలా అమలు చేస్తున్నారు.
- ఎలక్ట్రీషియన్లు నాన్ కాంటాక్ట్ ఓల్టేజ్ డిటెక్టర్ మీటర్‌ను తప్పనిసరిగా హెల్మెట్‌కు పెట్టి విధులు నిర్వహించేలా చూస్తున్నారు. పవర్ ఆఫ్ చేసి మరమ్మతు చేసే క్రమంలో పొరపాటున పవర్ సప్లయ్ ఐతే మీటర్ రెడ్‌బల్బు వెలిగి అలర్ట్ చేస్తుంది.
- యంత్రాల వద్ద పనిచేసేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని, టూల్స్‌ను వినియోగించేలా చూస్తున్నారు.
- ఓసీపీలో డంపర్లు బొగ్గు రవాణా చేసే సమయంలో వాటి మధ్యదూరం 30 మీటర్లు, ఓబీ డంప్ చేసే సమయంలో 15 మీటర్ల దూరం తప్పనిసరిగా ఉండేలా చూస్తున్నారు. ఇలా ఎస్వోపీలు అనేక విధానాలు పాటిస్తూ విధులు నిర్వర్తించడంతో ప్రమాదాలు తగ్గుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

### 14న మోకు దెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం

**తాండూర్:** ఈ నెల 14న మోకు దెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం హైదరాబాద్‌లోని నాగోల్‌గల గౌడజన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జాతీయ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులుగౌడ్, కార్యదర్శి బూసారపు మొండిగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శి సిద్ది రాములుగౌడ్, ఇతర నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### వీసీ ద్వారా జీఎం సమీక్ష


సమీక్షలో పాల్గొన్న ఏరియా అధికారులు

**శ్రీరాంపూర్:** పర్సనల్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని సమస్యలపై కార్పొరేట్ జీఎం పర్సనల్ (ఐఆర్ అండ్ పీఎం) హనుమంతరావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీరాంపూర్ ఏరియా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన పలు అంశాలు, కోర్టు పరిధిలోని కేసులు, ఉద్యోగుల సర్వీస్ అంశాలపై సమీక్షించారు. ఉద్యోగులకు సంబంధించిన క్యాడర్ స్కీంతో పాటు గైర్హాజరు కార్మికుల వివరాలు తెలుసుకున్నారు. శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవింద్‌రావు, డెప్యూటీ పర్సనల్ మేనేజర్లు రాజేశ్వరరావు, దేవేందర్‌రెడ్డి, రాజు, సంక్షేమాధికారులు సునీల్ శంకర్ రణదీప్‌గౌడ్, పాషా, మోహన్ పాల్గొన్నారు.

### అద్దెకు ఎస్సీ కార్పొరేషన్ గదులు

**బెల్లంపల్లి:** పట్టణంలోని ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన ఐదు గదులను నిరుద్యోగులకు నెలవారీ అద్దెకివ్వనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ఓ ప్రకటనలో తెలిపారు. 21–45 ఏళ్లలోపు ఎస్సీ నిరుద్యోగ యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.2లక్షలకు మించకుండా ఉండాలని సూచించారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# గుండ్ల చెరువులో కొలతలు

- 'శిఖం' పరిశీలించిన అధికారులు


జాయింట్ సర్వే చేస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

**నెన్నెల:** మండలంలోని ఆవుడం గుండ్ల చెరువును రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు మంగళవారం జాయింట్ సర్వే చేశారు. ఆక్రమణకు గురైన శిఖం భూములను గుర్తించేందుకు కొలతలు తీశారు. ఈ నెల 8న 'సాక్షి' జిల్లా పేజీలో 'కబ్జా కోరల్లో శిఖం భూములు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఏఈఈ సాయికృష్ణ, ఆర్ఐ గణేశ్, మండల సర్వేయర్ కృష్ణ చెరువు వద్దకు వెళ్లి హద్దులు గుర్తించారు. సర్వే నంబర్ 704లోని మామిడితోట చెరువు శిఖంలో ఉన్నట్లు స్పష్టం చేశారు. చెరువులో నీళ్లు నిలిచి ఉండడంతో పూర్తి స్థాయి కొలతలు తీయలేకపోయారు. శిఖం హద్దులు గుర్తించినట్లయితే షెడ్డు నిర్మిస్తున్న స్థలం శిఖం భూమిలో ఉందో.. లేదో.. తెలుస్తోందని వారు పేర్కొన్నారు. వారం రోజుల్లో కొలతలు పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

# కాంట్రాక్టర్‌తో అధికారులు, ఎమ్మెల్యే చర్చలు

**కాసిపేట:** తమకు న్యాయంగా వేతనాలు చెల్లించే దాకా సమ్మె విరమించేది లేదని కాంట్రాక్ట్ కార్మికులు భీష్మించుకు కూర్చోవడంతో ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రతిపక్ష యూనియన్ల నాయకులు వారికి మద్దతు ప్రకటించారు. ప్రధాన నాయకులంతా మద్దతు తెలపడంతో పరిస్థితి చేజారి పోతుందని అధికారులు కలగజేసుకున్నారు. మంగళవారం జీఎం మోహన్‌రెడ్డి, సింగరేణి అధికారులు, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, ఎమ్మెల్యే చిన్నయ్య సదరు కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకుడిని పిలిపించారు. మందమర్రి జీఎం కార్యాలయంలో చర్చలు జరిపారు. 'వారు నూతనంగా ఏమీ అడగడం లేదు కదా.. మీ సంస్థ ఇతర చోట ఇచ్చినట్లు ఇవ్వమంటున్నారు' అని నచ్చజెప్పగా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అయినప్పటికీ సదరు సంస్థ అధికారులతో మాట్లాడి చెప్తా అని నిర్వాహకుడు అనడంతో బుధవారం కార్మికుల ముందు అధికారికంగా రాతపూర్వకంగా ప్రకటించే అవకాశాలున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తంజేశారు. మరోపక్క ఓపెన్‌కాస్ట్‌లో మరో రెండ్రోజుల్లో బొగ్గు నిల్వలు నిండుకోనుండడంతో సింగరేణికి కూడా సమ్మె విరమణ తప్పనిసరి అయింది. లేనట్లయితే ఉత్పత్తి రావడం కష్టంగా మారుతుంది. అధికారికంగా ప్రకటిస్తారా? లేక ప్రభుత్వ పెద్దలతో అధికారులు, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి చేయిస్తారా? అనే అనుమానాలు కార్మికులు వ్యక్తంజేస్తున్నారు.

# 'అందర్ బాహర్' గుట్టురట్టు

- రూ.లక్షకు పైగా నగదు స్వాధీనం
- 14మందితోపాటు నిర్వాహకులపై కేసు


నగదు, కాయిన్స్, కార్డ్స్‌తో ఎస్సై, సిబ్బంది

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుగా సాగుతున్న అందర్ బాహర్ పేకాట వ్యవహారాన్ని పోలీసులు గుట్టురట్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేంపల్లి గ్రామ శివారులోని మంచిర్యాల గార్డెన్స్‌లో సోమవారం అర్ధరాత్రి డబ్బులతో అందర్ బాహర్ (పేకాట) ఆడుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు మంచిర్యాల గార్డెన్స్‌లో ఆకస్మిక దాడులు జరిపారు. కాయిన్స్‌తో పేకాడుతున్న 14మందితో పాటు నిర్వాహకుడు బూంబత్తుల శంకర్, వాచ్‌మన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిర్వాహకుడు పల్లె ఆంజనేయులు అక్కడి నుంచి పరారయ్యాడు. పేకాట స్థావరం నుంచి రూ.1,07,780 నగదు, 153 కాయిన్స్ స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు బూంబత్తుల శంకర్, పల్లె ఆంజనేయులుతో పాటు మరో 15 మందిపై గేమింగ్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల రూరల్ సీఐ తోట సంజీవ్, హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

### తొమ్మిది గంటలపాటు నిలిచిన విద్యుత్

**బెల్లంపల్లి:** బెల్లంపల్లిలో సింగరేణి విద్యుత్ సరఫరాకు మంగళవారం తొమ్మిదిగంటలపాటు అంతరాయమేర్పడింది. మందమర్రి నుంచి బెల్లంపల్లికి వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్ పాతబెల్లంపల్లి శివారు ప్రాంతంలోని ఎర్రచందనం తోట వద్ద తీగలు తెగిపోగా ఉదయం 10–30 గంటలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. పునఃరుద్ధరణ పనులు చేయాల్సిన మందమర్రి ఏరియా వర్క్‌షాప్ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు ఎర్రచందనం తోటలోకి వేరే వ్యక్తులు అడుగు పెట్టకుండా యజమాని కోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకువచ్చారని తెలిపి జాప్యం చేశారని పలువురు ఆరోపించారు. దీంతో పలువురు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు సమస్య తెలిపారు. ఆయన మందమర్రి ఏరియా జీఎంతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. జీఎం సింగరేణి ఎలక్ట్రికల్ విభాగం అధికారులను పురమాయించగా వారు పోలీసుల సహకారం తీసుకుని విద్యుత్ తీగలను సరిచేసి రాత్రి 7–30 గంటలకు కరెంట్ సరఫరాను పునఃరుద్ధరించారు.

### కొనసాగుతున్న కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె


శిబిరం వద్ద మద్దతు ప్రకటిస్తున్న సీతారామయ్య

**కాసిపేట:** మందమర్రి ఏరియా కేకే ఓసీలో ఆర్వీఆర్ కాంట్రాక్ట్ సంస్థ తీరును నిరసిస్తూ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె, నిరసన దీక్ష మంగళవారం ఏడోరోజుకు చేరింది. ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి సీతారామయ్య శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండ్రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని భరోసా కల్పించారు. ఆయన వెంట ఏఐటీయూసీ నాయకులున్నారు.

### గిరిజనుడి ఆత్మహత్యాయత్నం

- రిమ్స్‌కు తరలిస్తుండగా 108 అంబులెన్స్ దిగి పారిపోయిన వైనం


కినక రాము

**కెరమెరి:** మండలంలోని గోండ్‌ఝరి గ్రామానికి చెందిన కినక రాము (45) కుటుంబ కలహాలతో మంగళవారం తన ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే అతడిని కెరమెరి పీహెచ్‌సీకి తరలించారు. ఎంఎల్‌హెచ్‌పీ మమత, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేనీ ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు రెఫర్ చేశారు. 108లో రామును రిమ్స్‌కు తరలిస్తుండగా ఉట్నూర్ మండలం సాకేరా గ్రామానికి సమీపానికి వెళ్లగా అతడు బహిర్భూమికి వెళ్తానని వాహనం దిగి పారిపోయాడు. అతడి కుటుంబీకులు వెంబడించినా దొరకలేదని ఈఎంటీ శ్రీనాథ్ తెలిపారు. రాము ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్ వైపునకు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

### గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు


గుడుంబా విక్రేతతో ఎస్సైలు

**జన్నారం:** మండలంలోని లింగయ్యపల్లి గ్రామంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో భూమిలో దాచిన బెల్లం పానకాన్ని పారబోశారు. దర్పుల రాంనాయక్ నుంచి మూడు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్, ఎక్సైజ్ ఎస్సై మౌనిక తెలిపారు.

# కైరిగూడ ఓసీపీ సందర్శన


వంతెన పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరెడ్డి, అధికారులు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని మంగళవారం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జీ వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి ఇన్‌ఫిట్ క్రష్షర్, కైరిగూడ ఓసీపీ నుంచి డోర్లి–1కు వెళ్లే రోడ్డు, వంతెనను పరిశీలించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఎస్వోటూ జీఎం నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో సత్యనారాయణ, డీజీఎం సతీశ్‌బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పీఈ రాజాజీ, ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇప్పిస్తానని టోకరా

- రూ.4 లక్షలు వసూలు చేసిన ఘనుడు
- కేసు నమోదు చేసిన పోలీసులు

**కాగజ్‌నగర్‌టౌన్:** కాగజ్‌నగర్‌లోని చారిగాం రోడ్డులో ఇటీవల ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పిస్తానని బెల్లంపల్లికి చెందిన ఎం.విజయ్‌సాగర్ నమ్మించి ఒకరి వద్ద రూ.4లక్షలు వసూలు చేశాడు. చివరికి పోలీసుల చేతికి చిక్కాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం బాలాజీఅనుకోడ గ్రామానికి చెందిన ఎల్ములె పవన్‌కుమార్‌కు బెల్లంపల్లికి చెందిన విజయ్‌సాగర్ పరిచయమయ్యాడు. విజయ్‌సాగర్ గతంలో కాగజ్‌నగర్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాడు. తనకు రూ.4లక్షలు ఇస్తే కాగజ్‌నగర్‌లో డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పిస్తానని పవన్‌కుమార్‌ను నమ్మించాడు. దీంతో పవన్‌కుమార్ విజయ్‌సాగర్‌కు రూ.4లక్షలు ఇచ్చాడు. అప్పటినుంచి విజయ్‌సాగర్ ఇల్లు ఇప్పించకుండా తిప్పుకొంటున్నాడు. విషయాన్ని గ్రహించిన పవన్‌కుమార్ తెలివిగా మరో ఇల్లు కావాలని విజయ్‌సాగర్‌ను కోరాడు. రూ.2లక్షలు ఇప్పిస్తానని నమ్మించి కాగజ్‌నగర్‌కు రప్పించాడు. పెట్రోల్ పంపులోని ఓ హోటల్‌లో మాట్లాడుతుండగా పోలీసులకు పట్టించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విజయ్‌సాగర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ బుద్దెస్వామి తెలిపారు.

# కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

**జన్నారం:** మండలంలోని కవ్వాల్‌కు చెందిన బోడ బన్సీలాల్‌ను కులం పేరుతో దూషించిన రేండ్లగూడ గ్రామానికి చెందిన అల్లం సాంబయ్య, అతడి కొడుకు పెద్దయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అల్లం సాంబయ్య చీటి వేస్తున్నట్లు బన్సీలాల్ వద్దకు వెళ్లి తన పేరు రాసుకుని రూ.10 లక్షలు తీసుకున్నాడు. చీటి వ్యవహారం సాంబయ్య కొడుకు పెద్దయ్య చూసుకునేవాడు. రూ.10లక్షలు ఇవ్వకపోవడంతో చీటి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన బన్సీలాల్‌ను కులం పేరుతో దూషించినట్లు ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్లం సాంబయ్య, ఆయన కుమారుడు పెద్దయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### షంషీర్‌నగర్ బస్తీలో చోరీ

**బెల్లంపల్లి:** మున్సిపాలిటీలోని షంషీర్‌నగర్‌లోగల ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో టీ శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. షంషీర్‌నగర్‌లో మార్త సూరక్క, ఆమె కొడుకు సుమన్ నివాసముంటున్నారు. ఈనెల 8వ తేదీన సూరక్క చాకేపల్లిలోని తల్లిగారింటికి వెళ్లింది. సుమన్ పరీక్ష రాసేందుకు కొత్తగూడెం వెళ్లాడు. 9వ తేదీన సూరక్క ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని బీరువాలో 15 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. మంగళవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** త్వరలోనే సీఎం కేసీఆర్ దృష్టికి ఉద్యోగుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా టీఎన్జీవోస్ కృషి చేస్తుందని కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్‌రెడ్డి స్పష్టంజేశారు. మంగళవారం మంచిర్యాల టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్సీ, 317 జీవో బాధితులకు న్యాయం జరిగేలా, 3 డీఏలు, సాధారణ స్పౌజ్ బదిలీలు త్వరగా చేపట్టేలా చూస్తామని తెలిపారు. టీఎన్జీవో ముందుండి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తుందని భరోసా కల్పించారు. టీఎన్జీవోస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్, జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రాజు, సంయుక్త కార్యదర్శి సునీత, వెంకటకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.